క్లుప్తంగా

నేడు ఆంజనేయుడి తిరునాల

రామాపురం : మండలంలోని కొమ్మూరివాండ్లపల్లె, సుద్దమల్ల పంచాయితీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయా ఆలయాల కార్యనిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు గణపతి పూజ, పుణ్యహావాచనం, 10గంటలకు పంచామృతాభిషేకం, పూజా కార్యక్రమం, 11 గంటలకు మంగళహారతి, మంత్రపుష్పం, ప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం, రాత్రి 9గంటలకు డీజే, డ్యాన్స్, చాందినీ బండ్ల మెరవణితోపాటు రాత్రి 10గంటలకు గాలివీడకు చెందిన నాగార్జున బృందంచే సానవుల చిన్నమ్మ కథను ప్రదర్శిస్తారన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం, మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన హనుమంతుని ఆలయం, దళవాయిపల్లిలో వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో నేడు హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా చేయనున్నారు. ప్రత్యేక అలంకారంలో హనుమంతుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మధ్యాహ్నం అన్నదాన చేపట్టనున్నారు.

బాధ్యతల స్వీకరణ


మల్లికార్జున రెడ్డి, ఎస్‌ఐ

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మల్లికార్జున రెడ్డి స్థానిక పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ తన విధులను బాధ్యతగా నిర్వహిస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. మండల పరిధిలోని ఎర్రచందనం, గంజాయి, నాటుసారా, అక్రమ ఇసుక రవాణా ను అరికట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


కలశస్థాపన పూజలు చేసిన దృశ్యం

సిద్దవటం (ఒంటిమిట్ట): మండల పరిధిలోని కమ్మపాలెంలో వీరాంజనేయ స్వామి 19వ వార్షికోత్సవం సందర్భంగా నూతన విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మూడు రోజులపాటు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వీరాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని మాజీ మండల అధ్యక్షుడు శ్రీరాముల నాయుడు కుమారుడు రాజా నాయుడు శనివారం తెలిపారు. ఆదివారం శ్రీ వీరాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలతో పాటు బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలియజేశారు.

దుర్గాదేవికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలను తీసుకువస్తున్న సతీష్‌కుమార్


గాలివీడు : గుండ్లచెరువు గ్రామం పెద్ద చెరువు నడిబొడ్డున వెలసిన దుర్గాదేవికి శనివారం వైఎస్సార్‌సీపీ నేత మోపిడి సతీష్‌కుమార్, గ్రామస్తులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు కీ.శే. ఉప్పు గంగయ్య కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా పాలేటమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని కలిబండ, పడమటికోన గ్రామాల సరిహద్దులో వెలసిన పాలేటమ్మ జాతర కలిబండ సర్పంచ్ జగన్నాదరెడ్డి, మాజీ సర్పంచ్ గురివిరెడ్డిల ఆధ్వర్యంలో శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు బోనాలు సమర్పించనున్నారు. ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మంచాలమ్మ జాతర



సంబేపల్లె: మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లెలో కొలువైన మంచాలమ్మ జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు


సంబేపల్లె: వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు


రాయచోటి అర్బన్: బొమ్మతయారీని పర్యవేక్షిస్తున్న రాజశేఖర్


ఒంటిమిట్ట: శిక్షణ శిబిరంలో విద్యార్థులు

సంబేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలని గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచర్ జోసఫ్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌ను విద్యార్థులకు సరళమైన పద్ధతిలో బోధించాడు. వేసవి సెలవుల్లో విలువైన సమయాన్ని వృథా చేయకూడదని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు వేసవి శిబిరాన్ని వినియోగించాలన్నారు. జూన్ 11 వరకు కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బొమ్మత తయారీతో సృజనాత్మకత

రాయచోటి అర్బన్ : బొమ్మల తయారీతో విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, సభ్యుడు రాజశేఖర్‌లు అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో జరుగుతున్న వేసవి వినోదం కార్యక్రమంలో ఒరిగామి నిపుణుడు రాజశేఖర్ అట్టలు, కాగితాలతో వివిధ రకాల బొమ్మలు తయారుచేసి చూపించారు. చేప బొమ్మ తయారీని పిల్లలతో చేయించి పర్యవేక్షించారు. బొమ్మల తయారీని విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా గమనించి, నేర్చుకున్నారు. ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మావతి పిల్లలకు జామ్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. పిల్లల చేత 20 పదాలు చెప్పించి వాటిని కూర్చుచేయించి ఒక కథను చెప్పించారు. కృషి, పట్టుదల, సాధన ఉంటే ఆంగ్లాన్ని సులువుగా నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు గంగిరెడ్డి, జేవీవీ సభ్యులు ఆంజనేయులు, ప్రతాప్, రవీంద్రనాథరెడ్డి, రామయ్య, బయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మండలంలోని కొత్త మాధవరంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల నిర్వహణలో భాగంగా శనివారం 22 మంది విద్యార్థులతో తరగతుల నిర్వహించినట్టు గ్రంథాలయ నిర్వాహకుడు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం, ఇంగ్లిష్ గ్రామర్, సుమతి శతకం పద్యాలు చెప్పించారు.

అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వాడాలి


అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

చిట్వేలి : అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు ఉపయోగించినప్పుడే ప్రపంచం శాంతియుతంగా ఉంటుందని ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ పేర్కొన్నారు. పొక్రాన్–2 విజయోత్సవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ అణుశక్తి, పొక్రాన్ – 2 పరీక్షాలు సైన్య రంగంలో ఉపయోగం, తదితరాలపై అవగాహన కల్పించారు. అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమలు, వ్యవసాయ, ఆరోగ్య సంరక్షణ మొదలగు శాంతియుత ప్రయోజనాల కోసం ఉపయోగించినప్పుడే ప్రపంచం శాంతియుతంగా ఉంటుందన్నారు. ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులంటే క్రమశిక్షణకు మారుపేరన్నారు. నిజ జీవితంలో అణుశక్తి ఉపయోగాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గరాజు, కానిస్టేబుల్ సుధాకర్, కిరణ్‌కుమార్ రాజు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ టెక్నాలజీ డే

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు నేషనల్ టెక్నాలజీ డేని ఘనంగా నిర్వహించారు. శనివారం ఎన్‌సీపీ లెఫ్టినెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొక్రాన్ – 2 ప్రయోగం విజయం సాధించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. టెక్నాలజీతో ప్రపంచం ఎంతో ముందుకెళ్లుతోందని ఈ క్రమంలోనే మన దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలను తీర్చండి


జెడ్పీ చైర్మన్‌కు సమస్యను తెలియజేస్తున్న శవనవారిపల్లి గ్రామస్తులు

రాజంపేట రూరల్ : తాగేందుకు కూడా నీరులేక ఇబ్బంది పడుతున్నామని శవనవారిపల్లి గ్రామ ప్రజలు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డికి విన్నవించారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌కు శనివారం ఆ గ్రామ ప్రజలు వచ్చి తాము ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరారు. గతంలో ఉన్న బోరు చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని విన్నవించారు. తమకు నూతనంగా బోరువేసి నీటి సమస్యను తీర్చాలని విన్నవించారు. అందుకు జడ్పీ చైర్మన్ స్పందిస్తూ త్వరలోనే నూతనంగా బోరు వేసి మోటారును బిగించి నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి పెంచలయ్య, శవనవారిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

సీనియర్ జాతీయ హాకీ క్రీడాకారుడు శుభన్ భాస్కర్


హోరాహోరీగా తలబడుతున్న బాలుర జట్లు

రాయచోటి : అంతర్జాతీయ స్థాయి హాకీ క్రీడలో జిల్లా క్రీడాకారులు రాణించాలని సీనియర్ జాతీయ హాకీ ఆటగాడు శుభన్ భాస్కర్ అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న జనార్దన్ రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ స్థాయిలో రాణిస్తున్న ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి కావాల్సిన శిక్షణ, సదుపాయాలు కల్పిస్తామన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభను కనబరిచిన వారిని ఆయన అభినందించారు. శనివారం రెండవ రోజు ఆసక్తికరంగా పోటాపోటీగా జరిగాయి. టోర్నీలో అనకాపల్లికి చెందిన నక్కపల్లి టీమ్, అన్నమయ్య జిల్లా రాజు హాకీ అకాడమీ, రాయచోటి హాకీ అకాడమీ జట్లు ముందడుగు వేశాయి. అలాగే బాలికల విభాగంలో అనకాపల్లికి చెందిన నక్కపల్లి జట్టు, కడప జట్టు, అన్నమయ్య జిల్లాకు చెందిన రాజు అకాడమీ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వర రావు, కోశాధికారి ఖదీరుల్లాఖాన్, సభ్యులు సుబ్బయ్య, సునీల్, మహేశ్వర్ రాజు, రెడ్డి శేఖర్ రాజు, శివప్రసాద్ నాయుడు, వెంకట కృష్ణ నాయుడు, పీటర్ దాస్, మైనుద్దీన్, లక్ష్మీరెడ్డి, బాలరాజు, అంజీ, హాకీ కోచ్‌లు వెంకట్, సుబ్రమణ్యం, నారాయణ, హాజిత, వివిధ జిల్లాల హాకీ మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

ఓబులవారిపల్లె : రెజ్లింగ్ క్రీడాకారిణీలపై లాఠీచార్జ్ చేయడం సిగ్గుచేటని, మహిళలను వేధిస్తున్న బీజేపీ ఎంపీని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవికి బీజేపీ ఎంపీని వెంటనే తొలగించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై గోవిందంపల్లి, చిన్నఓరంపాడు పంచాయతీలలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మహిళా సమాఖ్య అన్నమయ్య జిల్లా కార్యదర్శి మల్లి సుమిత్ర, మండల సీపీఐ కార్యదర్శి నాగమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాలలో భక్తుల ప్రత్యేక పూజలు


సంబేపల్లె: పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు


చిన్నమండెం: అలంకరణలో లక్ష్మీనృసింహుడు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పలు ఆలయాలలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రి చెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. రాచపల్లి సమీపంలోని నామాలగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరబల్లెలో..

వీరబల్లె(రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం మట్లి గ్రామం వండెపల్లెలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు.

మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

చిన్నమండెం : మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌ను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండలంలోని అడవికమ్మపల్లె గ్రామంలో వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని సుందరంగా అలంకరించారు. అర్చకులు పూజాది క్రతువులను నిర్వహించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పాలన


మైనార్టీ మహిళల సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో గ్రామాల్లోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం తెలిపారు. పట్టణంలోని సచివాలయం– 1 పరిధిలోని పగడాలపల్లిలో గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి చోటు లేకుండా నిబద్ధతతో పారదర్శకంగా పాలన చేస్తూ ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. దీంతో నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడి భవిష్యత్‌కు భరోసా ఉండాలంటే జగనన్న పాలన శాశ్వతంగా ఉండాలన్నారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన సేవలను అందిస్తున్నామన్నారు. ఉన్నత చదువులు చదివే వారికి జగనన్న విదేశీ విద్య పథకాన్ని తీసుకొచ్చామని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అందిస్తుండటంతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోటశివసాయి, ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్, సుధాకర్‌రాజు, రత్తయ్య, రౌఫ్, కరీముల్లా, ప్రవీణ్, లత, మొహమ్మద్, రాజ, లక్ష్మయ్యనాయుడు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన


లక్కిరెడ్డిపల్లె: లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి ఫైజున్నిసా

రాజంపేట : నందలూరు కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జడ్జి లత అధ్యక్షతన నిర్వహించారు. 530 కేసులకు శాశ్వత పరిష్కారం చేశారు. సివిల్ కేసులో రూ.12,05,332, క్రిమినల్ కేసులలో రూ.7,30,700 పరిష్కరించి ఫిర్యాదుదారులకు ఇప్పించారు. క్రిమినల్ కేసులలో రూ.2,30,676 ప్రభుత్వానికి జమచేశారు. పీఎల్‌పీ కేసులలో రూ.6,55,000, పరిష్కారం చేశారు. ఎస్‌బీఐ రుణాల కేసులకు సంబంధించి రూ.2,93,798 తగ్గించి, మూడు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, నందలూరు, పెనగలూరు, పుల్లంపేటకు సంబంధించిన పోలీసులు, కోర్టు కానిస్టేబుల్స్, లోక్‌అదాలత్ సభ్యులు ఫైజుల్లాఖాన్‌లోడి, హస్తవరం ఆనందకుమార్ , నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, ఏజీపీ షమీ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : రాజీ మార్గమే రాజ మార్గమని లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టు జడ్జి ఫైజున్నిసా పేర్కొన్నారు. శనివారం స్థానిక లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 246 కేసులు పరిష్కారమయ్యాయని మొండి బకాయిలు రూ. 11,53,063లు వసూలయ్యాయని కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, చెన్న కృష్ణయ్య, బాలాజీ రెడ్డి, సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి, కొండారెడ్డి, శివకుమార్, రామాపురం, గాలివీడు పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

188 కేసుల పరిష్కారం

సిద్దవటం(ఒంటిమిట్ట) : సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలో 188 కేసులు పరిష్కారమైనట్లు సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వివిధ కేసుల్లో రూ. 9.49 లక్షలు రికవరీ చేశామన్నారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇరువర్గీయులు రాజీ మార్గం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా శాశ్వత పరిష్కారం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీపీ తాజుద్దీన్, లోక్ అదాలత్ మెంబర్లు రామదాసు, సుధామణి, అడ్వకేట్లు వెంకట రత్నం, సీవీ సుబ్బారెడ్డి, రాఘవేంద్ర, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటిలో 771 కేసుల పరిష్కారం

రాయచోటి టౌన్ : లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న చాలా కేసుల పరిష్కారం లభిస్తోందని న్యాయమూర్తులు అన్నారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్స్, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు మొత్తం 771 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా బాధితులకు మొత్తం రూ.72,49,250లు అందజేశారు. జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి ఎస్. కృష్ణ కుట్టి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఇష్రత్ ఫాతిమా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె. శారదలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకంగా మోడీ పాలన

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

రాయచోటి అర్బన్ : దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడం ద్వారా కార్మిక హక్కులను కాపాడుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఎన్‌జీఓ సభా భవనంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం ఆ సంస్థ అధ్యక్షుడు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, కార్మికులకు వ్యతిరేకంగా మోడీ పాలనను సాగిస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక నల్లచట్టాల తయారీ ద్వారా కార్మికుల హక్కులు నిర్వీర్యం చేస్తున్నారంటూ ఆరోపించారు. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల స్కీముల్లో పనిచేస్తున్న స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, నేతలు యం.ఎస్. రాయుడు, సురేష్‌బాబు, సరోజమ్మ, సలీంబాషా, నరసింహులు, సికిందర్, నేలపాటి శ్రీనివాసులు, గాలిచంద్ర, బత్తల వెంకటరమణ, పుల్లయ్య, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చిట్వేలి : మండల పరిధిలోని మిట్టపల్లి, వడ్డిపల్లి, కె.కందులవారిపల్లి, గొల్లపల్లి, కస్తూరివారిపల్లి, నక్కలపల్లి, జోరోపల్లి, నారపరెడ్డిపల్లి, ఆత్మయ్యగారిపల్లి, సి.కందులవారిపల్లె గ్రామాలలో శనివారం ప్రబోధ సేవా సమితి పాదలకూరు, దుత్తలూరు, నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రబోధానంద ఆత్మజ్ఞాన సందేశం ప్రసంగాన్ని ప్రదర్శనలో ఉంచి ఇంటింటికి త్రైత సిద్ధాంత భగవద్గీతను పరిచయం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.సురమౌలి, పెంచల నరసయ్య, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.